సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
మంగళవారం ၊ 11 ၊ ఫిబ్రవరి ၊ 2025



నులిపురుగుల మాత్రలు వేయాలి

పిల్లలందరికీ నులి పురుగుల నివారణ మాత్రలు తప్పనిసరిగా వేయాలని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ ఆదేశించారు. 8లో



తగ్గని మంచు ప్రభావం

జిల్లాలో ఉష్ణోగ్రతలు స్థిరంగా కొనసాగుతున్నాయి. మంచు ప్రభావం ఏమాత్రం తగ్గలేదు. 8లో



మహా కుంభమేళాకు ప్రత్యేక రైళ్లు

భక్తుల సౌకర్యార్థం పలు ప్రత్యేక రైళ్లు మహా కుంభ మేళా కోసం నడుపుతున్నామని డీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహూ తెలిపారు. 8లో

క్లుప్తంగా

నేటి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్ష వాయిదా

సాక్షి, పాడేరు: మన్యం బంద్ కారణంగా ఈనెల 11వ తేదీన పాడేరు డివిజన్‌లో నిర్వహించాల్సిన ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్ పరీక్షను వాయిదా వేసినట్టు కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.మళ్లీ ఎప్పుడు నిర్వహించేది తెలియజేస్తామని పేర్కొన్నారు. ఇంటర్ విద్యార్థులు ఈ విషయాన్ని గమనించాలని తెలిపారు.

మహిళ హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు

అడ్డతీగల: మహిళ హత్య కేసులో ఓ వ్యక్తికి జీవిత ఖైదు, రూ.5 వేలు జరిమానా విధిస్తూ రాజమహేంద్రవరం ఐదవ అడిషినల్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి డి.విజయ గౌతమ్ సోమవారం తీర్పు చెప్పినట్టు అడ్డతీగల సీఐ బి.నరసింహమూర్తి తెలిపారు. 2021లో గంగవరం పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసు పూర్వాపరాలను ఆయన తెలిపారు. కాకినాడ జిల్లా పండూరుకి చెందిన నువ్వుల పాప, అదే గ్రామానికి చెందిన యర్రంశెట్టి రవికుమార్‌కి రూ.2 లక్షలు అప్పు ఇచ్చింది. ఆ సొమ్మును తిరిగి ఇవ్వమన్నందుకు కక్ష పెంచుకుని 2021లో నువ్వుల పాపను హత్యచేసి, గంగవరం మండలం అడ్డపల్లి వద్ద పడేసినట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది. వీఆర్వో ఫిర్యాదు మేరకు మహిళ మృతదేహాన్ని గుర్తించి కేసు నమోదు చేసి, దర్యాప్తు అనంతరం నిందితుడు యర్రంశెట్టి రవికుమార్‌ను అరెస్టు చేసినట్టు సీఐ నరసింహమూర్తి తెలిపారు. నేరారోపణ రుజువు కావడంతో నిందితుడు రవికుమార్‌కి న్యాయమూర్తి జీవితఖైదుతో పాటు రూ.5 వేలు జరిమానా విధించారని సీఐ చెప్పారు.

జియో ట్యాగింగ్‌తో విద్యుత్ సమస్యల పరిష్కారం



ఏఈఈ ప్రభాకరరావు

చింతపల్లి: స్థానిక విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా జియో ట్యాగింగ్‌ను అమలు చేస్తున్నట్టు ఏఈఈ ప్రభాకరరావు సోమవారం తెలిపారు. ఇందుకోసం విద్యుత్ శాఖకు చెందిన రికార్డులను పూర్తిగా డిజిటలైజ్ చేస్తున్నామన్నారు. ఉపకేంద్రం పరిధిలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లు, విద్యుత్ స్తంభాలతో పాటు లైన్ల వివరాలను జియో ట్యాగింగ్ చేస్తున్నట్టు చెప్పారు. ఎక్కడ సమస్య ఏర్పడినా సత్వరమే గుర్తించి, పరిష్కరించేందుకు ఆస్కారం ఉంటుందని ఏఈఈ తెలిపారు.

కేకే లైన్‌లో రైళ్ల గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం(విశాఖ): వాల్తేర్ డివిజన్, బచేలి-కిరండూల్ స్టేషన్‌ల పరిధిలో జరుగుతున్న ఆధునికీకరణ పనుల నిమిత్తం కేకే లైన్‌లో నడిచే పలు రైళ్లు ఆయా తేదీల్లో దంతేవాడ వరకే రాకపోకలు సాగిస్తాయని వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. విశాఖపట్నం-కిరండూల్(58501) పాసింజర్ ఈ నెల 13 నుంచి మార్చి 6వతేదీ వరకు, తిరుగు ప్రయాణంలోకిరండూల్-విశాఖపట్నం(58502) పాసింజర్ మార్చి 7వ తేదీ వరకు దంతేవాడ వరకు మాత్రమే రాకపోకలు సాగిస్తాయి. విశాఖపట్నం-కిరండూల్(18514) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 13 నుంచి మార్చి 6వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలోకిరండూల్-విశాఖపట్నం(18513)ఎక్స్‌ప్రెస్ మార్చి 7వ తేదీ వరకు దంతేవాడ వరకు మాత్రమే రాకపోకలు సాగిస్తాయి. ఈ తేదీల మధ్య దంతేవాడ-కిరండూల్ మధ్య ఈ రైళ్లు రాకపోకలు సాగించవు.

డ్వాక్రా గ్రూపులకు రుణాల మంజూరుపై విచారణ



విచారణ జరుపుతున్న ఏపీడీ దేగలయ్య

రాజవొమ్మంగి: మండలంలోని సుబ్బంపాడు గ్రామంలో రెండు మహిళా సంఘా (ఎస్‌హెచ్‌జీ)లకు ఎటువంటి తీర్మానం, అర్హత లేకుండా రూ.40 లక్షల మేర రుణాలు మంజూరు చేయడంపై సోమవారం వెలుగు కార్యాలయంలో విచారణ నిర్వహించారు. వెలుగు ఏపీడీ దేగలయ్య ఆయా గ్రూపు సభ్యుల అభిప్రాయాలను సేకరించారు. ఈ సందర్భంగా దేగలయ్య మాట్లాడుతూ వెలుగు అధికారుల అనుమతులు లేకుండా, సభ్యుల తీర్మానం లేకుండా అరుణ, స్రవంతి గ్రూపుల ఖాతాలకు రూ.20 లక్షల చొప్పున జమ చేసినట్టు తేలిందన్నారు. అప్పటికే ఆయా సంఘాలే రూ.లక్షల్లో బకాయి చెల్లించవలసి ఉందన్నారు. అయినా కొత్తగా రుణాలు ఏ విధంగా మంజూరు చేశారో స్పష్టత లేదని చెప్పారు. ఈ విచారణలో నానిబాబు, బ్యాంకు లింకేజీ మేనేజర్ కిశోర్,ఏజీఎం వరలక్ష్మి, ఏపీఎం రామాంజేయులు, ఎంఎంఎస్ లీడర్లు పప్పుల బాలమ్మ, సాగినదేవి పాల్గొన్నారు.



జాఫ్రా మొక్కలు

జాఫ్రా అధరహో

వారపు సంతల్లో జోరుగా అమ్మకాలు

కిలో రూ.260 ధరతో కొనుగోలు

రూ.450 వరకు రేటు పెరుగుతుందన్న వ్యాపారులు

జిల్లాలో 3,900 ఎకరాల్లో సాగు

సీజన్ ప్రారంభంలోనే మంచి ధర లభించడంతో రైతులు హర్షం



ముంచంగిపుట్టు: గిరిజన రైతులు సాగు చేసే జాఫ్రా ధర ఈ ఏడాది అదరహో అనిపిస్తోంది. నామమాత్రపు పెట్టుబడితో ఎక్కువ ఆదాయం తీసుకువచ్చే జాఫ్రా సాగుపై గిరిజన రైతులు ఆసక్తి చూపుతున్నారు. గత రెండు సంవత్సరాల నుంచి మార్కెట్‌లో జాఫ్రాల ధర బాగుంది. ఔషధ గుణాలు,అధిక పోషకాలు కలిగిన జాఫ్రాలకు జాతీయ, ప్రాంతీయ మార్కెట్లలో మంచి డిమాండ్ ఉంది. పొలాల గట్లు, మెట్ట,పోడు భూముల్లో గిరిజన రైతులు వీటిని సాగుచేస్తున్నారు. ఆర్గానిక్ ఆహార ఉత్పత్తులకు ప్రస్తుతం డిమాండ్ ఉండడంతో సహజసిద్ధ రంగును అందిస్తున్న జాఫ్రా గింజల వినియోగం పెరిగింది.మన దేశంలో కర్ణాటక,తమిళనాడు,ఆంధ్రప్రదేశ్,వెస్ట్ బెంగాల్,మహారాష్ట్ర,ఒడిశా,అస్సోం తదితర రాష్ట్రాల్లో చల్లని వాతావరణం ఉన్న ప్రదేశాలు జాఫ్రా సాగుకు అనుకూలం. జిల్లాలో 22 మండలాల్లో 3,900 ఎకరాల్లో జాఫ్రాను గిరిజన రైతులు సాగు చేస్తున్నారు.గత కొన్ని సంవత్సరాలుగా జాఫ్రాల కొనుగోలు పెరిగింది.జిల్లాలో ముంచంగిపుట్టు, పెదబయలు, అనంతగిరి, అరకు ,డుంబ్రిగుడ, జి.మాడుగుల, చింతపల్లి, మారేడుమిల్లి, రంపచోడవరం, వై.రామవరం మండలాల్లో అధికంగా సాగు చేస్తున్నారు.

ఈ ఏడాది ధర బాగుంది



ఈ ఏడాది జాఫ్రాల ధర బాగుంది.ప్రస్తుతం వారపు సంతల్లో కిలో రూ.260 చొప్పున వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు.రానున్న రోజుల్లో ధర మరింత పెరుగుతుందని జాఫ్రాలను నిల్వ చేస్తున్నాను. ధర పెరిగితే విక్రయిస్తాను.గతంలో ఇంటి రంగుల కోసం మాత్రమే పంటను సాగు చేసేవాళ్లం. మార్కెట్‌లో డిమాండ్ ఉండడంతో ఎక్కువగా సాగు చేస్తున్నాను.

-ఎస్. కన్నయ్య, గిరిజన రైతు,కొత్తసుజనకోట, ముంచంగిపుట్టు మండలం



ముంచంగిపుట్టు వారపు సంతలో జాఫ్రాలను కొనుగోలు చేస్తున్న వ్యాపారి

ప్రయోజనాలు..

జాఫ్రా సహజసిద్ధమైన సింధూరం రంగులో ఉంటుంది. 25 సంవత్సరాల కింద ఈ పంట సాగును గిరిజనులు గృహాల రంగుల కోసం మాత్రమే చేసేవారు. దీని వల్ల ఉపయోగాలు గుర్తించిన అధికారులు గిరిజనులకు అవగాహన కల్పించడంతో అమ్మకాలు చేసేందుకు సాగు విస్తీరణం పెంచారు. సుగంధద్రవ్యాలు, వెన్న, జున్ను, ఐస్‌క్రీమ్, మాంసాహారం, మిఠాయిలు,శీతల పానీయాలు, ఫుడ్‌కలర్, వస్త్రాలు, సౌందర్య పోషకాలు,సబ్బులు, చెప్పుల పాలిష్, నెయిల్ పాలిష్, హెయిర్ ఆయిల్స్, లిప్‌స్టిక్ తయారీలో వినియోగిస్తారు. వీటిలో వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించే కెరోటినాయిడ్లు అధికంగా ఉంటాయి.జాఫ్రా చెట్టు బెరడును ఆయుర్వేద వైద్యంలో గనేరియా వ్యాధి నివారణకు,విత్తనాల గుజ్జును బంకవిరేచనాలను అరికట్టేందుకు,ఆకులను పాముకాటు విషయం విరుగుడుకు,పచ్చకామెర్ల నివారణకు ఉంపయోగిస్తుంటారు. దీంతో పాటు జాఫ్రా గింజల వాడకం వల్ల క్యాన్సర్ సోకే అవకాశం లేదని వైద్యులు తెలిపారు.దీంతో జాఫ్రాల వినియోగం ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతూ వస్తోంది.

సాగు విధానం..

జాఫ్రాను విత్తనాలు లేదా ముదురు కాండం కొమ్మలను నాటుకొని సాగు చేయవచ్చు.విత్తనం ద్వారా మొక్కలను చేసుకోవాలి.ప్రతి ఏడాది జులై నుంచి అక్టోబర్ నెల మధ్యలో నాటుకోవాలి.ప్రతి మొక్కకు 10 అడుగుల దూరం ఉండాలి.ఎకరాకు 500 మొక్కల వరకు నాటుకోవచ్చు.మొక్క నాటిన 3 సంవత్సరాల తరువాత కాపు వస్తుంది.జాఫ్రా మొక్కలకు తెగుళ్ల బెడద ఉండదు.పశువులు తినవు, రసాయన పురుగు మందులను పిచికారీ చేయకూడదు.



జాఫ్రాలను శుద్ధి చేస్తున్న గిరిజనులు

విదేశీ మార్కెట్లో డిమాండ్

నేచురల్ కలర్‌గా జాఫ్రాను వాడడంతో విదేశీ మార్కెట్‌లో మంచి డిమాండ్ నెలకొంది.ఈ ఏడాది ప్రారంభంలోనే కిలో ధర రూ.260 పలుకుతోంది.రానున్న మూడు నెలల్లో రూ. 450 వరకు ధర చేరుకుంటుందని వ్యాపారులు తెలిపారు.ముఖ్యంగా గిరిజన ప్రాంతంలో జరిగే వారపు సంతల్లో జాఫ్రాలకు పలుకుతున్న ధర మరే ఇతర పంటకు లేదు.గత ఏడాది జాఫ్రా ధర ఫిబ్రవరిలో కిలో రూ.200 ఉండగా మే నెల వచ్చే సరికి రూ.400 కి చేరుకుంది. దీంతో జాఫ్రాల సేకరణలో గిరిజన రైతులు బిజీ బిజీగా ఉన్నారు.చెట్ల నుంచి జాఫ్రాలను ఇంటికి తీసుకువచ్చి ఎండబెట్టి శుద్ధి చేసి, గింజలుగా తయారు చేస్తున్నారు. వారపు సంతల్లో విక్రయిస్తున్నారు. అధిక ధర పలుకుతుండడం పట్ల గిరిజన రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.మైదాన ప్రాంతాల వ్యాపారులతో పాటు ఒడిశా రాష్ట్రం నుంచి వచ్చే వ్యాపారులు అధికంగా జాఫ్రాలను కొనుగోలు చేసి లారీలు,వ్యాన్లలో తరలిస్తున్నారు.

ధర పెరిగే అవకాశం ఉంది



దేశ,విదేశాల్లో జాఫ్రాలకు డిమాండ్ ఉంది.దీంతో ధర పెరుగుతూ వస్తోంది.గత ఏడాది కిలో ధర రూ.400 పలికింది.ప్రస్తుతం రూ. 260ధరతో కొనుగోలు చేస్తున్నాం.రానున్న రోజుల్లో ధర రూ. 450వరకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నాం. జాఫ్రాల డిమాండ్ దృష్ట్యా వారపు సంతల్లో అధికం కొనుగోలు చేస్తున్నాం.

-పి.ఈశ్వరరావు, వ్యాపారి, జోలాపుట్టు

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం



జాఫ్రాతో బహుళప్రయోజనాలున్నాయి.దీని వినియోగం పెరుగుతోంది. జాఫ్రాకు మంచి మార్కెట్ ఉండడం శుభ పరిణామం. రైతులకు మార్కెట్,విత్తనాల సేకరణ వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నాం

-ఎ.రమేష్‌కుమార్, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి

మన్యం బంద్ విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు, ఎమ్మెల్సీ డాక్టర్ రవిబాబు



కలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ, సీపీఎం,ఇతర అఖిలపక్ష నేతలు

సాక్షి, పాడేరు: గిరిజన హక్కులు, చట్టాలను గౌరవించాల్సిన ఏపీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు 1/70 చట్టాన్ని సవరించి, టూరిజం అభివృద్ధి చేయాలన్న వ్యాఖ్యలకు నిరసనగా మంగళ, బుధవారాల్లో నిర్వహిస్తున్న రాష్ట్ర వ్యాప్త మన్యం బంద్‌ను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ డాక్టర్ కుంభా రవిబాబు, ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు పిలుపునిచ్చారు. పార్టీనాయకులు, అఖిలపక్ష నేతలతో సోమవారం సమావేశమయ్యారు. 48 గంటల బంద్ విజయవంతానికి సమీక్షించారు. సీపీఎం, సీపీఐ, గిరిజన సంఘం, ఆదివాసీ జేఏసీతో పాటు పలు గిరిజన ప్రజాసంఘాలు రెండు రోజుల మన్యం బంద్‌కు సంపూర్ణ మద్దతునిచ్చినట్లు ప్రకటించారు.

సహకరించాలని కలెక్టర్‌కు వినతి

1/70 చట్టాన్ని సవరించాలన్న స్పీకర్ అయ్యన్నపాత్రుడుపై చర్యలు తీసుకోవడంతో పాటు గిరిజనులకు క్షమాపణ చెప్పాలనే డిమాండ్‌తో ఈనెల 11,12 తేదీల్లో నిర్వహిస్తున్న రాష్ట్ర వ్యాప్త మన్యం బంద్‌కు సహకరించాలని కలెక్టర్ దినేష్‌కుమార్‌కు అఖిలపక్ష, పలు ప్రజాసంఘాల నేతలు సోమవారం వినతి పత్రం అందజేశారు. అనంతరం అఖిలపక్ష నేతలు విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకువెళ్లి పరిష్కరిస్తామని, శాంతియుతంగా బంద్ పాటించి, పోలీసులకు సహకరించాలని కలెక్టర్ సూచించినట్టు చెప్పారు. గిరిజన చట్టాలు, హక్కులను పరిరక్షించాల్సిన పాలకులు 1/70 చట్టానికి తూట్లు పొడిచే ఆలోచన చేయడం బాధాకరమన్నారు. రాష్ట్ర వ్యాప్త మన్యం బంద్‌ను అడ్డుకుని, భగ్నం చేసేందుకు ఎన్నికల నిబంధనలను ప్రభుత్వం సాకుగా చూపడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్టీసెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కూడా సురేష్‌కుమార్, పాడేరు నియోజకవర్గ అధ్యక్షుడు శరభ సూర్యనారాయణ, స్థానిక నాయకులు కూడా సుబ్రహ్మణ్యం,సీపీఎం రాష్ట్ర నేత పి.అప్పలనరస,గిరిజన సమాఖ్య నేత కూడా రాధాకృష్ణ, పలు సంఘాల నేతలు చుంచు రాజబాబు,వంతాల నాగేశ్వరరావు,సమర్ది మాణిక్యం, కొండపల్లి కాంతారావు,జీవన్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పాల్గొనాలి: 1/70 చట్టాన్ని సవరించాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా నిర్వహించనున్న రాష్ట్ర వ్యాప్త మన్యం బంద్‌కు విద్యార్థులంతా సహకరించాలని ఆదివాసీ జేఏసీ కన్వీనర్ రామారావుదొర కోరారు.స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు శతక బుల్లిబాబు, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు సుర్ల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

1/70 చట్టంపై స్పీకర్ అయ్యన్న వ్యాఖ్యలు దారుణం



రంపచోడవరం: గిరిజనులకు సంజీవనిలాంటి 1/70 చట్టాన్ని సవరించాలని స్పీకర్ అయ్యన్న పాత్రుడు అనడం దారుణమని మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. శాసన సభాపతిగా ఉండి అయ్యన్న పాత్రుడు గిరిజనుల మనుగడకు నష్టం కలిగించే విధంగా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యలను నిరసిస్తూ మంగళ, బుధవారాల్లో నిర్వహించనున్న మన్యం బంద్‌కు వైఎస్సార్ సీపీ పూర్తి మద్దతు తెలుపుతోందని చెప్పారు.పార్టీలకు అతీతంగా బంద్‌లో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు గిరిజన జాతికి క్షమాపణ చెప్పాలన్నారు.కూటమి ప్రభుత్వం గిరిజన చట్టాలను నిర్వీర్యం చేసి, ఈ ప్రాంతంలోని ఖనిజ సంపదను దోచుకునేందుకు కుట్ర పన్నుతోందని ఆరోపించారు. గిరిజన చట్టాలను రక్షించుకునేందుకు ఆదివాసీలు, వివిధ గిరిజన సంఘాల ఆధ్వర్యంలో జరిగే 48 గంటల నిరవధిక మన్యం బంద్‌లో వైఎస్సార్ సీపీ గిరిజన నాయకులు, కార్యకర్తలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

గిరిజనుల హక్కులు కాలరాస్తే ఖబడ్దార్

అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం



డుంబ్రిగుడ: గిరిజనుల హక్కులను కాలరాస్తే సహించేది లేదని అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 11, 12 తేదీల్లో జరిగే రాష్ట్ర వ్యాప్త మన్యం బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. 1/70 చట్టాన్ని సవరించాలని స్పీకర్ అయ్యన్న పాత్రుడు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా నిర్వహిస్తున్న బంద్‌లో అందరూ పాల్గొనాలని కోరారు. మన్యం బంద్‌కు వైఎస్సార్‌సీపీ సంపూర్ణ మద్దతు ఇస్తోందని తెలిపారు. స్పీకర్ వ్యాఖ్యలపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. అయ్యన్న పాత్రుడు వ్యాఖ్యలను ఏజెన్సీ ప్రాంతానికి చెందిన కూటమి నాయకులు కనీసం ఒక్కరైనా ఖండించిన దాఖలాలు లేవని, వారు ఆదివాసీల వైపో, కూటమి ప్రభుత్వం వైపో స్పష్టం చేయాలన్నారు. హక్కులను హరిస్తున్న కూటమి ప్రభుత్వానికి ఆదివాసీల సత్తా తెలిసేలా మన్యం బంద్‌లో పార్టీలకు అతీతంగా రాజకీయ నాయకులు, ఉద్యోగులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, ప్రజా సంఘాల సభ్యులు, విద్యార్థులు, యువత పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

చింతపల్లి ఆస్పత్రి సూపరింటెండెంట్‌పై వేటు

- పర్యవేక్షణ బాధ్యతలు మరో వైద్యాధికారికి అప్పగిస్తూ ఉత్తర్వులు
- వైద్యుల నిర్లక్ష్యంపై ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు ఫిర్యాదు మేరకు చర్యలు



సూపరింటెండెంట్‌గా నియమితులైన ఇందిర ప్రియాంక

చింతపల్లి: విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు రావడంతో స్థానిక ప్రాంతీయ ఆస్పత్రికి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతిని, డీడీవో చంద్రశేఖర్‌ను ఆయా బాధ్యతలను తప్పించారు. డాక్టర్ ఇందిర ప్రియాంకకు సూరింటెండెంట్ బాధ్యతలు అప్పగిస్తూ ఏపీ డైరెక్టర్ ఆఫ్ హెల్త్ ఆస్పత్రుల విభాగం సమన్వయకర్త డాక్టర్ శంకర్ ప్రసాద్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ఇప్పటి వరకూ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా ఉన్న చిన్నపిల్లల వైద్యనిపుణురాలు డాక్టర్ ప్రభావతి పనితీరుపై అనేక ఆరోపణలు వచ్చాయి. ప్రధానంగా చిన్నారులకు వైద్యసేవలందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోపాటు ఆస్పత్రి నిర్వహణ విషయంలో పలు ఆరోపణలు వచ్చాయి. ఇటీవల చింతపల్లి మండలంలోని వాంగెడ్డ కొత్తూరు గ్రామంలో పలువురు చిన్నారులు ఆకస్మికంగా మరణించా రు. ఈవిషయంలో చింతపల్లి ఆస్పత్రి వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ బాధిత చిన్నారుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. చిన్నారుల వరుస మరణాలపై పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు స్పందించారు. ఆస్పత్రికి వచ్చి విచారణ చేయడంతో పాటు ఆ గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరా మర్శించారు. చిన్నారుల వరుస మరణాలపై ప్రభుత్వం విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈనేపథ్యంలో ప్రభుత్వం సమగ్ర విచారణకు ఆదేశించింది. దీంతో విశాఖ కేజీహెచ్‌కు చెందిన వైద్య ఆచార్యుల బృందంతోపాటు పాడేరు ఆస్పత్రుల సమన్వయకర్త కృష్ణారావు, విశాఖ డీసీహెచ్‌ఎస్ డాక్టర్ శంకర్‌ప్రసాద్‌లు వేర్వే రుగా విచారణ జరిపారు.చింతపల్లి ఆస్పత్రిలో లోపాలను గుర్తించారు.ఖర్చుల విషయంలోనూ కొన్ని తప్పులు జరిగినట్టు కొనుగొన్నారు. వీటన్నింటినీ పరిగణలోకి తీసుకున్న అధికారులు ఆమెపై వేటు వేశారు. ఆస్పత్రి పర్యవేక్షణ బాధ్యతల నుంచి తప్పించారు. ఆస్పత్రిలో పనిచేస్తున్న డాక్టర్ ఇందిరప్రియాంకకు ఈబాధ్యతలను తాత్కాలికంగా అప్ప గిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. డ్రాయింగ్ అధికారిగా పనిచేసిన డాక్టర్ చంద్రశేఖర్‌ను ఆ బాధ్యతల నుంచి తప్పించారు. తాజాగా ఆస్పత్రి సూపరెంటెండెంట్‌గా నియమించిన ఇందిరప్రియాంక మంగళవారం బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది.

ముగిసిన నామినేషన్ల పర్వం

- ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి చివరి రోజు రెండు నామినేషన్ల దాఖలు
- మొత్తం 10 మంది నామినేషన్లు
- రేపు పరిశీలన, 13న ఉపసంహరణ



రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను అందజేస్తున్న పెదపెంకి శివప్రసాద్

మహారాణిపేట(విశాఖ): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి నామినేషన్ల ప్రక్రియ సోమవారంతో ముగిసింది. ఆఖరి రోజు రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. స్వతంత్ర అభ్యర్థులు పెదపెంకి శివప్రసాద్, సుంకర శ్రీనివాసరావు రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్‌కు సంబంధిత పత్రాలను అందజేశారు. అభ్యర్థుల చేత రిటర్నింగ్ అధికారి ప్రమాణం చేయించారు. ఫిబ్రవరి 3వ తేదీన నోటిఫికేషన్ వెలువడగా, సోమవారం వరకు నామినేషన్లు స్వీకరించారు. నామినేషన్ల పర్వం ముగిసే సరికి 10 నామినేషన్లు దాఖలైనట్టు కలెక్టర్ వెల్లడించారు. మంగళవారం నామినేషన్ల పరిశీలన, 13న ఉపసంహరణ ఉంటుంది. ఆ తరువాత పోటీలో ఎంతమంది ఉన్నారో స్పష్టమవుతుంది. అనంతరం ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు గుర్తుల కేటాయింపు, ఇతర ప్రక్రియలు కొనసాగుతాయని కలెక్టర్ హరేందిర ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్వో, జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీ శంకర్ , నోడల్ అధికారి దయానిధి, ఎన్నికల సెల్ అధికారులు పాల్గొన్నారు.

నామినేషన్లు వేసిన అభ్యర్థులు

కోసూరు రాధాకృష్ణ, పాకలపాటి రఘువర్మ, సత్తలూరి శ్రీరంగ పద్మావతి, కోరెడ్ల విజయ గౌరి, నూకల సూర్యప్రకాశ్, రాయల సత్యనారాయణ, గాదె శ్రీనివాసులు నాయుడు, పోతల దుర్గారావు, పెదపెంకి శివప్రసాద్, సుంకర శ్రీనివాసరావు నామినేషన్లు దాఖలు చేశారు.



తీరంలో కొలువు తీరిన శ్రీలక్ష్మీ మాధవస్వామి

మాఘపౌర్ణమి జాతరకు చలో.. చలో..

- రేవుపోలవరం తీరంలో చక్ర తీర్థం
- వాడపాలెంలో కూడా కట్టుదిట్టమైన ఏర్పాట్లు
- పరవాడ డీఎస్పీ విశ్వస్వరూప్

ఎస్.రాయవరం : మాఘపౌర్ణమి జాతరకు రేవు పోలవరం తీరం సిద్ధం అయ్యింది. ప్రతి ఏడాది మాఘపౌర్ణమి నాడు సముద్రపు రేవులో పుణ్య స్నానాలు ఆచరించి తీరంలో వేంచేసియున్న శ్రీ లక్ష్మీమాధవ స్వామిని దర్శించుకోవడం ఆనవాయితీ. ఈ జాతరకు లక్షకు పైగా భక్తులు వస్తారని అంచనా. చక్రతీర్థంగా పిలిచే జాతరలో భక్తులకు వివిధ ప్రభుత్వ శాఖలు ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తారు. శ్రీ సత్యసాయి, స్థానిక యువజన సంఘాల సభ్యులు సేవా కార్యక్రమాలు చేపడతారు.

ఆర్టీసీ, పోలీస్ శాఖల ఏర్పాట్లు

తీరానికి ప్రధాన మార్గం ఉన్న అడ్డురోడ్డు నుంచి రేవు పోలవరం ప్రత్యేక బస్సులు అధిక సంఖ్యలో నడపనున్నారు. అనుమతులు లేని ప్రైవేటు వాహనాలు అడ్డురోడ్డు సమీపంలో నిలిపివేస్తారు. పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించనున్నారు. అడ్డురోడ్డు, కొరుప్రోలు, గుడివాడ, రేవు పోలవరం జంక్షన్ల వద్ద ప్రత్యేక గస్తీ నిర్వహించి భక్తులను తరలించే ఏర్పాట్లు చేస్తారు. వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ సదుపాయం ఏర్పాటు చేశారు. రేవులో భక్తుల పుణ్యస్నానాల సందర్భంగా ప్రమాదాలు తలెత్తకుండా గజ ఈతగాళ్లు రక్షణగా ఉంటారు. తీరం సమీపంలో తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. మండల పరిషత్ శాఖ నుంచి ఉచితంగా తాగునీరు పంపిణీ, స్వచ్ఛంద సంస్థల వారు మజ్జిగ, చిరుప్రసాదాలు అందజేస్తారు.



వాడపాలెం తీరంలో జాతర ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న పరవాడ డీఎస్పీ విశ్వ స్వరూప్

శ్రీలక్ష్మీమాధవ స్వామికి అయిదు రోజుల సేవలు

రేవు పోలవరం తీరంలో వేంచేసియున్న శ్రీ లక్ష్మీమాధవస్వామి మాఘపౌర్ణమి పురస్కరించుకుని అయిదు రోజుల పాటు ప్రత్యేక పూజలందిస్తారు. ఈ నెల 8న శనివారం నుంచి లక్ష్మీ మధవస్వామికి పూజలందిస్తూ భీష్మ ఏకాదశినాడు కల్యాణం నిర్వహించారు. సోమ, మంగళ వారాల్లో ప్రత్యేక హోమాలు నిర్వహించి పౌర్ణమినాడు అవభృతస్నానం, చక్రతీర్థం నిర్వహిస్తారు.

వాడపాలెంలో కట్టుదిట్టంగా ఏర్పాట్లు

రాంబిల్లి (యలమంచిలి) : మాఘపౌర్ణమి జాతరకు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపడుతున్నట్టు పరవాడ డీఎస్పీ విశ్వ స్వరూప్ తెలిపారు. మాఘపౌర్ణమి జాతర సందర్భంగా రాంబిల్లి మండలం వాడపాలెం సముద్రతీర ప్రాంతాన్ని ఆయన సోమవారం మెరైన్, విపత్తులశాఖ, రెవెన్యూ, పోలీసుశాఖ అధికారులతో కలసి పరిశీలించారు. రేవులో భక్తులు పుణ్యస్నానాలు చేయడానికి అనువైన ప్రాంతాలను గుర్తించడం, ప్రమాదకరమైన ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు, ఇతర రక్షణ చర్యల గురించి అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా రాంబిల్లి సీఐ నరసింగరావు విలేకరులతో మాట్లాడుతూ 12వ తేదీన జరిగే మాఘ పౌర్ణమి జాతర సందర్భంగా సముద్ర స్నానాలకు వచ్చే భక్తులు విధిగా జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రస్తుతం వాడపాలెం తీరం లోతుగా ఉండడంతో భక్తులంతా పోలీసులకు సహకరించి నిషేధిత ప్రాంతాలకు దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో రాంబిల్లి సీఐ నరసింగరావు, మెరైన్ సీఐ సింహాద్రినాయుడు, యలమంచిలి విపత్తులశాఖ అధికారి రాంబాబు, రాంబిల్లి తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో జయమాధురి పాల్గొన్నారు.



పూడిమడకలో జగన్నాథ స్వామి ఆలయం

పూడిమడకకు ప్రత్యేక బస్సులు

అనకాపల్లి : మాఘపౌర్ణమిని పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి పూడిమడక సముద్రస్నానానికి 5 ప్రత్యేక బస్‌లు నడుపుతున్నట్లు డిపో ఇన్‌ఛార్జ్ మేనేజర్ వై.రవిచంద్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం తెల్లవారు జామునుంచి పూడిమడక సముద్రస్నానానికి వెళ్లే భక్తుల కోసం మరో 30 ప్రత్యేక బస్‌లు నడుపుతున్నట్లు తెలిపారు.

నేడే పూడిమడక జాగరణ

అచ్యుతాపురం : అందాల సహజ తీరం పూడిమడక ఒడ్డున మాఘ పౌర్ణమి వేడుకలకు ముస్తాబయ్యింది. లక్షకు పైగా జనాభా విచ్చేసే మాఘ పౌర్ణమి జాగరణ సందర్భంగా మంగళవారం రాత్రి సముద్ర తీరాన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించనున్నారు. వివిధ తినుబండారాలతో కూడిన స్టాళ్లు ఏర్పాటు చేస్తారు. బాణాసంచా విన్యాసాలు అలరించనున్నాయి. వారం రోజుల నుంచి జగన్నాథ స్వామి ఆలయంలో పూజలు ప్రారంభం అయ్యాయి. పూడిమడక ప్రధాన రహదారుల్లో విద్యుత్ సెట్టింగ్‌లు ఏర్పాటు చేశారు. మంగళవారం అర్ధరాత్రి వరకూ జాతరను ఆస్వాదించనున్న మత్స్యకార కుటుంబీకులు, జిల్లా ప్రజలు రాత్రి అంతా జాగారం ఉంటారు. ప్రత్యేక బృందాలు, మెరైన్ పోలీసులు బందోబస్తు నిర్వహిస్తారు. బుధవారం తెల్లవారు జాము నుంచి పౌర్ణమి స్నానాలు ఆచరిస్తారు. ఇందుకోసం మొబైల్ బాత్‌రూంలు, బట్టలు మార్చుకునే షెల్టర్లు ఏర్పాటు చేస్తున్నారు. అలాగే తీరంలో ప్రమాదస్థాయి లోపు భారీ తాళ్లు ఏర్పాటు చేస్తున్నారు. అనకాపల్లి నుంచి పూడిమడక వరకూ ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులను నడపనున్నారు. అచ్యుతాపురం జంక్షన్ దాటిన తర్వాత ప్రైవేట్ వాహనాలను నియంత్రించనున్నారు. పూడిమడక హైస్కూల్ జంక్షన్ తర్వాత ఎటువంటి వాహనాలను అనుమతించే అవకాశం లేదని సీఐ గణేష్ తెలిపారు. జాతరకు ఏర్పాట్లపై పరవాడ డీఎస్పీ విష్ణు స్వరూప్ పర్యవేక్షించారు. స్థానిక పోలీసు అధికారులు, ఇతర శాఖల అధికారులతో చర్చించారు. కాగా ఈ విడత జాతర వేడుకల ఏర్పాట్ల బాధ్యత నుంచి సర్పంచ్‌కు పెద్దగా ప్రాధాన్యం ఇవ్వలేదు. జాతరను తాము నిర్వహిస్తామని తేదేపా, జనసేన శ్రేణులు పోటీ పడ్డాయి. చివరకు రెండు వర్గాలు కలిసి జాతరను నిర్వహించాలని నిర్ణయించారు. జాతరల్లో మితిమీరిన రాజకీయ జోక్యం తగదని గంగపుత్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

పిల్లలందరికీ నులిపురుగుల నివారణ మాత్రలు వేయాలి

హుకుంపేట: పిల్లలందరికీ నులి పురుగుల నివారణ మాత్రలు తప్పనిసరిగా వేయాలని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ ఆదేశించారు. సోమవారం స్థానిక కస్తూర్బా గాంధీ విద్యాలయంలో ఏర్పాటు చేసిన జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవ కార్యక్రమంలో జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి జమాల్‌బాషాతో కలిసి విద్యార్థినులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2 నుంచి 19 సంవత్సరాల మధ్య వయసు గల పిల్లలందరూ నులి పురుగుల మాత్రలు వేసుకోవాలని చెప్పారు. ఈ మాత్రలు వేయడం వల్ల ఎలాంటి ఇబ్బందులు ఉండవని తెలిపారు. జిల్లాలో 3.35 లక్షల మంది పిల్లలు ఉన్నారని, అందరికీ నులిపురుగుల నివారణ మాత్రలు అందజేయాలని వైద్య సిబ్బందికి ఆదేశించారు. నులి పురుగుల వల్ల రక్తహీనత, ఆకలి మందగించడం, కడుపునొప్పి, వికారం, వాంతులు, విరోచనలు, బరువు తగ్గడం వంటి సమస్యలు ఏర్పడతాయని చెప్పారు. వీటిని నిర్మూలించాలంటే తప్పకుండా మాత్రలు వేసుకోవాలని తెలిపారు. అనంతరం పాఠశాలలో 8వ తరగతి విద్యార్థినులతో ఇంగ్లిష్ చదివించారు. వారు సరిగ్గా చదవకపోవడంతో ఇంగ్లిష్ టీచర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థినులపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రామ్ అధికారి ప్రతాప్,గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రజని,డీఈవో బ్రహ్మాజీ, పీహెచ్‌సీ వైద్యాధికారులు కిషోర్ కుమార్, లక్ష్మయ్య,ఎంఈవోలు చెల్లయ్య,ఈశ్వరరావు,స్థానిక వైద్యాధికారులు మోహన్‌సాయి రెడ్డి,సౌజన్య పాల్గొన్నారు.



హుకుంపేటలో విద్యార్థినులకు నులిపురుగు నివారణ మాత్రలు వేయిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలి

చింతూరు: డ్రైవింగ్ సమయంలో వాహనదారులంతా తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని చింతూరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ చెల్లారావు అన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా సోమవారం విద్యార్థులు, డ్రైవర్లతో కలసి రవాణాశాఖ ఆధ్వర్యంలో చింతూరులో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీఐ మాట్లాడుతూ అందరూ విధిగా డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. అతివేగం ప్రమాదాలకు కారణమని తెలిపారు. పరిమితికి మించి వాహనాల్లో ప్రయాణికులను ఎక్కించరాదని, నిబంధనలకు వ్యతిరేకంగా లారీల్లో ఓవర్ లోడ్ వేయరాదని ఆయన సూచించారు.



చింతూరులో రవాణాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ర్యాలీ

భైకును ఢీకొన్న లారీ.. ఒకరి మృతి

అనకాపల్లి : మండలంలో జాతీయ రహదారి పిసినికాడ జంక్షన్ వద్ద రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందినట్టు రూరల్ ఎస్ఐ రవికుమార్ సోమవారం చెప్పారు. ఎస్ఐ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణంలో రామునాయుడు కాలనీకి చెందిన వి.అశ్వనీకుమార్, హర్షవర్ధన్‌లు ద్విచక్రవాహనంపై కశింకోటలో స్నేహితుడి జన్మదిన వేడుకలకు వెళ్లి ఆదివారం రాత్రి తిరిగి వస్తుండగా కశింకోట నుంచి అనకాపల్లి జాతీయ రహదారిలో వెనుక నుంచి లారీ ఢీ కొట్టింది. దీంతో ద్విచక్రవాహనం నడుపుతున్న అశ్వనీకుమార్ అక్కడికక్కడే మృతి చెందగా, హర్షవర్ధన్ స్వల్పగాయాలతో స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. హర్షవర్ధన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. ప్రమాదానికి కారణమైన లారీని గుర్తించడం జరిగిందని, త్వరలో డ్రైవర్‌ను అరెస్టు చేస్తామన్నారు.

మహా కుంభమేళాకు ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం(విశాఖ): ప్రయాణికులు, భక్తుల సౌకర్యార్థం పలు ప్రత్యేక రైళ్లు మహాకుంభ మేళా కోసం నడుపుతున్నామని డీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహూ తెలిపారు. ఈ నెల 16, 22వ తేదీల్లో విశాఖ–గోరఖ్‌పూర్ స్పెషల్, తిరుగు ప్రయాణంలో ఈ నెల 19, 24వ తేదీలలో గోరఖ్‌పూర్–విశాఖ స్పెషల్, ఈ నెల 20, 27వ తేదీల్లో విశాఖ–దీన్‌దయాళ్ ఉపాధ్యాయ స్పెషల్ తిరుగు ప్రయాణంలో ఈ నెల 22, మార్చి 1వ తేదీల్లో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ– విశాఖ స్పెషల్ , ఈ నెల 15,22వ తేదీల్లో తిరుపతి –బనారస్ స్పెషల్ (వయా దువ్వాడ), తిరుగు ప్రయాణంలో ఈ నెల 17,24వ తేదీల్లో బనారస్–తిరుపతి స్పెషల్ (వయా దువ్వాడ) మీదుగా నడవనున్నాయన్నారు.

ఆ వార్తల్లో నిజం లేదు

ప్రయోగ్‌రాజ్ స్టేషన్ మూసివేస్తున్నట్టు మీడియాలో వస్తున్న కథనాలను నమ్మవద్దని డీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహూ విజ్ఞప్తి చేశారు. యుద్ధప్రాతిపదికన రైల్వే అధికారులు పనిచేస్తూ నిత్యం వందలాది రైళ్ల రాకపోకలు సాగించేలా చర్యలు చేపడుతున్నారన్నారు. నార్త్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్, ప్రయాగ్‌రాజ్, వారణాసి, లక్నో డీఆర్ఎంలతో కలిసి ప్రయాగ్‌రాజ్‌లోనే ఉంటూ ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తున్నట్లు ఆయన తెలిపారు.

తగ్గని మంచు ప్రభావం

చింతపల్లి: జిల్లాలో ఉష్ణోగ్రతలు స్థిరంగా కొనసాగుతున్నా, మంచు ప్రభావం తగ్గలేదు. సోమవారం డుంబ్రిగుడలో 12.9 డిగ్రీలు, అనంతగిరిలో 14.1 డిగ్రీలు, చింతపల్లిలో 17.0 డిగ్రీలు, జి.మాడుగులలో 16.9 డిగ్రీలు, జీకే వీధిలో 14.5 డిగ్రీలు,హుకుంపేటలో 14.0 డిగ్రీలు, కొయ్యూరులో 19.8 డిగ్రీలు, పాడేరులో 15.9 డిగ్రీలు, పెదబయలులో 13.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్టు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి అప్పలస్వామి తెలిపారు.

అధిక లోడుతో వెళ్తున్న మూడు లారీలకు జరిమానా



పోలీసులు స్వాధీనం చేసుకున్న లారీ

యలమంచిలి రూరల్: అధిక లోడుతో వెళ్తున్న మూడు లారీలను యలమంచిలి పట్టణ, ట్రాఫిక్ పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. రాంబిల్లి నేవల్ ఆల్టర్‌నేటివ్ ఆపరేటింగ్ బేస్(ఎన్ఏవోబీ) నిర్మాణ పనులకు బండరాళ్లను తరలిస్తున్న లారీలను పోలీసులు సోమవారం తనిఖీలు చేయగా.. పరిమితికి మించి లోడుతో వెళ్తున్నట్టు గుర్తించారు. పోలీసులు రెండు, యలమంచిలి పట్టణ పోలీసులు ఒకటి మొత్తం మూడు లారీలను స్వాధీనం చేసుకుని అనకాపల్లి ఆర్టీవోకు అప్పగించారు. ఒక్కో లారీకి రూ.62,000 చొప్పున జరిమానా విధించినట్టు ఎస్ఐ కె.సావిత్రి తెలిపారు. అధిక లోడును రవాణా చేస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె ఈ సందర్భంగా హెచ్చరించారు.

పసుపు సాగును ప్రోత్సహిస్తాం

కలెక్టర్ దినేష్‌కుమార్



హాజరైన వ్యాపారులు,విక్రయదారులు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి, పాడేరు: జిల్లాలో పసుపు సాగును ప్రోత్సహిస్తామని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ తెలిపారు. ఉద్యానవనశాఖ, డిజిటల్ గ్రీన్‌సంస్థ, మిలిందా గ్రేట్ ఫౌండేషన్ సంయుక్తంగా సోమవారం స్థానిక వి.ఆర్.ఫంక్షన్‌హాల్‌లో పసుపు కొనుగోలు, విక్రయదారులకు ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలోనే జిల్లాలో 60 శాతం పసుపుసాగు జరుగుతోందన్నారు. గిరిజన రైతులంతా సేంద్రియంగా పసుపును సాగు చేస్తున్నారని, వారికి మరింత అవగాహన కల్పిస్తే మంచి దిగుబడులు వస్తాయని చెప్పారు. కొనుగోలుదారులంతా గిరిజన రైతులకు సహకరించాలని సూచించారు. గిరిజన రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని తెలిపారు. రైతులు సంఘాలుగా ఏర్పడాలని సూచించారు.మార్చి 15వ తేదీ నుంచి జిల్లాలో వ్యవసాయ ఉత్పత్తులు, పెట్టుబడులు,నికర ఆదాయంపై సమగ్రమైన సర్వే నిర్వహించనున్నట్టు చెప్పారు.ఈ సమావేశంలో జేసీ డాక్టర్ అభిషేక్‌గౌడ,ఉద్యానవన సంయుక్త సంచాలకులు డాక్టర్ ఎం.జి.మునిరెడ్డి,జిల్లా ఉద్యానవనశాఖ అధికారి రమేష్‌కుమార్‌రావు, జిల్లా వ్యవసాయాధికారి నందు,సెరీకల్చర్ అధికారి అప్పారావు, స్పైసెస్ బోర్డు సహాయసంచాలకులు వి.విజీషా,ఉద్యానవన శాస్త్రవేత్త బిందు,ఇమిర్చా ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ జ్యోతి,స్పైసెస్ బోర్డు క్షేత్ర అధికారి కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

FLAT FOR SALE

■ 1100sft, 2BHK Flat at Madhavadhara, Car Parking. Direct call. No brokers. Ph : 96182 11333 [SCA25001575]

TO-LET

■ 3 BHK 1500 SFT G/F Deluxe E/F flat with All Facilities At Sivajipalem Road For Rent. Con. K.V.Rao - 8885371555 [SCA25001573]

Services

CHANGE OF NAME

■ I, Chandaka Hyndavie (Old Name) W/o, Karanam Srikanth R/o 1-153, Main Road, B C Hindu Sai Baba Temple, Palakonda Mandal, Gottamangala Puram, Po: Gotta mangalapuram, Dist : Parvathipuram Manyam, Andhra Pradesh - 532440, have changed my name to Chandaka Hyndavi (New name) Hereafter my name is known as Chandaka Hyndavi (New Name). [DA-41128]

GOLD LOANS

■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 13197]

OLD AGE HOME

■ Elder Home గాజువాక & అక్కయ్యపాలెం వృద్ధుల ఆశ్రమం. వృద్ధులకు మంచాన వున్న వారికి మంచి వాతావరణం, ఆరోగ్యకరమైన భోజనం 24 గం॥ వైద్యసేవలు. హోమ్‌కేర్ సర్వీస్ కలదు. ఫోన్ : 87904 49799, 90103 92178 [SCA25001554]

Wanted

■ Urg. Req. for Pvt. Ltd. Company, Qualf : Dip. / Degree in Civil Eng. Auto Cad 2D & 3D with good knowledge at Endada. Ph : 79890 60925, 98663 50824 [V- 12329]

■ Wanted 4th Std. English & EVS Teacher (EM) 8:45am to 4:45pm. Wonworld School, 4-47-7, Lawsonsbay Colony, Pedawaltair, VSP. Ph : 98482 37187, 82351 23123 [V- 13330]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం, జీ: 18K. Ph: 9160900024, 9640400073 [HA-1400]

■ సెక్యూరిటీగార్డ్స్, ఆఫీస్‌బాయ్, ప్యాకింగ్ హెల్పర్, వెయిట్‌లిఫ్టింగ్, జీ:12K, ఫీల్డ్ ఆఫీసర్, సూపర్‌వైజర్, PF, ESI విశాఖపట్నంలో పనిచేయుటకు కావలెను. 80744 44019, 89040 40900. [T-1235623]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

అనకాపల్లి	: 9010546644
యలమంచిలి	: 9951602901
చోడవరం	: 9010210265
నర్సీపట్నం	: 9010234557
పాడేరు	: 9010973030

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం

వేటమామిడిలో పశు వైద్య శిబిరం

సాక్షి ఎఫెక్ట్..

అడ్డతీగల: వేటమామిడిలో 'అంతు చిక్కని అనారోగ్యంతో పశువులు మృతి' శీర్షికతో 'సాక్షి'లో ఈనెల 10వ తేదీన ప్రచురితమైన వార్తకు పశుసంవర్ధకశాఖ అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా వేటమామిడి, పణుకురాతిపాలెం గ్రామాల్లో సోమవారం ఉచిత పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. రెండు గ్రామాల్లోనూ పశువైద్యాధికారి తరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో 42 పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేసినట్టు పశు సంవర్ధకశాఖ అడ్డతీగల అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్.గణేష్ తెలిపారు.అలాగే వేటమామిడిలో 20 లేగదూడలకు ఏలిక పాముల మందు వేశామన్నారు. 42 గొర్రెలు, మేకలకు జలగరోగ నివారణ మందు ఇచ్చినట్టు పేర్కొన్నారు. పశువులకు సోకే వ్యాధులపై అవగాహన కల్పించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించినట్టు తెలిపారు.



వేటమామిడిలో మేకలకు మందులు వేస్తున్న సిబ్బంది

మెరుగైన సేవలు అందించండి

ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి

పాడేరు రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మెరుగైన సేవలు అందించాలని ఐసీడీఎస్ పీడీ (ప్రాజెక్టు డైరెక్టర్) ఎస్.సూర్యలక్ష్మి సూచించారు. మండలంలోని జి.కాలనీ, సుండ్రుపుట్టు, ఎం.కె.వీధి, చాకలిపేట, పి.గొందురూ ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె సోమవారం సందర్శించారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, చిన్నారుల తల్లులతో సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పీడీ సూర్యలక్ష్మి మాట్లాడుతూ సెంటర్ల ద్వారా అందిస్తున్న బాలామృతాన్ని చిన్నారులకు తప్పనిసరిగా అందజేయాలన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. పిల్లల పెరుగుదలతో పాటు బరువు మార్పులను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. అంగన్‌వాడీ సిబ్బంది పౌష్టికాహారం పంపిణీ సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. సీడీపీవో ఝాన్సీరాణి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



చిన్నారుల తల్లులతో మాట్లాడుతున్న పీడీ సూర్యలక్ష్మి

హృద్రోగులకు సకాలంలో వైద్య సేవలు

కూనవరం: గుండెకు సంబంధించిన సమస్య ఉంటే వెంటనే ఆస్పత్రికి రావాలని సూపరింటెండెంట్ డాక్టర్ మహేష్ బాబు అన్నారు. మండల పరిధిలోని కోతులగుట్ట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సోమవారం గుండె వ్యాధులపై ఉందంటూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రులలో గుండెకు భరోసా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్టెమి పేరుతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో గుండె నొప్పి వచ్చిన వారికి గంట వ్యవధిలో ప్రాణాపాయం నుంచి రక్షించేందుకు రూ. 45 వేల విలువైన ఇంజక్షన్ అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఈ సౌకర్యాన్ని అవసరమైన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమాచారాన్ని ప్రతీ ఒక్కరు తెలుసుకొని, అందరికి తెలియజేయాలని సూచించారు. డాక్టర్లు వివేక్, తేజ, శ్వేత, ప్రజ్వల, షామిన్, హెడ్ నర్స్ బొజ్జి, ఫార్మసిస్ట్ జోగారావు, సిబ్బంది పాల్గొన్నారు.



కోతులగుట్ట ప్రభుత్వాస్పత్రిలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ మహేష్‌బాబు

రైల్వేస్టేషన్‌లో గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం(విశాఖ): విశాఖ రైల్వేస్టేషన్‌లో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న నిందితులను జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.80వేలు విలువగల 16 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సోమవారం విశాఖ రైల్వే స్టేషన్‌లో జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో జీఆర్‌పీ ఎస్ఐ కేటీఆర్ లక్ష్మి, ఎస్ఐ ఒభిషేక్ మిస్త్రీ .. సిబ్బందితో కలిసి ప్లాట్‌ఫారాల్లో తనిఖీలు నిర్వహించారు. ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లాకు చెందిన మిట్టు ఖేమిండు, బసంత ఖేముండు, నీలకంఠ బండా, ఉత్తరప్రదేశ్ వారణాసికి చెందిన రజనీష్ కుమార్ సింగ్‌లు అక్రమంగా గంజాయి రవాణా చేయడాన్ని గుర్తించారు. వీరి నుంచి గంజాయి స్వాధీనం చేసుకుని, నిందితులను రిమాండ్‌కు తరలించారు.

మరో కేసులో 7 కిలోల గంజాయి సీజ్...

సోమవారం మరో కేసులో ఉత్తరాఖండ్‌కు చెందిన మోహన్ సింగ్ నుంచి రూ.35వేలు విలువైన 7 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీలలో జీఆర్పీ ఎస్ఐ శాంతారం, సీఐబీ/ఆర్పీఎఫ్ ఎస్ఐ ఎస్‌కే బారిక్‌లు తమ తమ సిబ్బందితో కలిసి తనిఖీలు చేశారు. నిందితుడ్ని రిమాండ్‌కు తరలించామన్నారు.

ఉత్తరాంధ్ర మహిళా ఆహ్వాన కబడ్డీ విజేత విశాఖ

మాడుగుల రూరల్: ఎం.కోడూరు మోదమాంబ తీర్థం సందర్భంగా నిర్వహించిన ఉత్తరాంధ్ర మహిళా ఆహ్వాన కబడ్డీ పోటీలు ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి 12 గంటల వరకు రసవత్తరంగా సాగాయి. ఈ పోటీల్లో విశాఖ జట్టు విజేతగా నిలిచింది. విజయనగరం జట్టు ద్వితీయ, అనకాపల్లి తృతీయ, పశ్చిమ గోదావరి జట్టు నాలుగో స్థానంలో నిలిచాయి. విజేతలకు వరుసగా రూ.18 వేలు, రూ.15 వేలు, రూ.12వేలు, రూ.10 వేలు చొప్పున సర్పంచ్ సంజీవిరావు, ఎంపీటీసీ సభ్యుడు రమణబాబు, సీడీసీ చైర్మన్ శ్రీనివాసరావు, పడాల అప్పలనాయుడు అందజేశారు.

కొత్త కథ సిద్ధం..

డైరెక్టర్ పరశురాం

కోటవురట్ల : డైరెక్టర్ పెట్ల పరశురాం కోటవురట్ల మండలం జల్లూరు శివారున జరిగిన ఓ ప్రైవేటు కార్యక్రమంలో సోమవారం పాల్గొన్నారు. నాతవరం మండలం చెర్లోపాలేనికి చెందిన పరశురాం కోటవురట్ల మండలంలోని బి.కె.పల్లికి చెందిన ప్రముఖ డైరెక్టర్ పెట్ల పూరీజగన్నాథ్‌కు బంధువు. స్వశక్తితో ఎదిగి తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకున్న పరశురాం ఎల్లప్పుడూ కొత్తదనంతో దర్శకత్వం చేసేందుకు ప్రయత్నిస్తారు. ఆయన ఇప్పటి వరకు 8 సినిమాలకు దర్శకత్వం వహించగా గీతగోవిందం సినిమా మంచి పేరు తీసుకొచ్చింది. ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంత వాసిగా సినిమా ఇండస్ట్రీలో గుర్తింపు పొందినందుకు గర్వంగా ఉంటుందన్నారు. ఇప్పటి వరకు 8 సినిమాలకు దర్శకత్వం వహించగా మరో సినిమాకు స్క్రిప్ట్ సిద్ధం అయ్యిందని, దిల్ రాజు నిర్మాతగా తెరకెక్కించేందుకు మెరుగులు దిద్దుతున్నట్టు తెలిపారు. ఈయనకు కైలాసపట్నానికి చెందిన లక్కబొమ్మల కళాకారుడు తంగేటి రాంబాబు తాను తయారు చేసిన మాతృమూర్తి బొమ్మను బహూకరించారు.



డైరెక్టర్ పరశురామ్‌కు లక్కబొమ్మను బహూకరిస్తున్న కళాకారుడు

రిమాండ్ ఖైదీ ఆత్మహత్యాయత్నం

కోర్టు భవనంపై నుంచి దూకిన ఖైదీ

విజయనగరం క్రైమ్: సబ్‌జైల్ నుంచి ఎస్కార్ట్ వాహనంలో విజయనగరం కోర్టుకు సోమవారం హాజరైన రిమాండ్ ఖైదీ... అదే కోర్టు భవనంపై నుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీనికి సంబంధించి టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనకాపల్లి జిల్లా పాయకరావుపేటకు చెందిన ఐ.త్రిమూర్తులు ఐదేళ్ల కిందట విజయనగరం అమ్మవారి జాతరలో పరిచయమైన ఓ యువతిని ప్రేమించాడు. ఆమె ఇద్దరు కవల పిల్లలకు జన్మనిచ్చింది. పెళ్లి చేసుకోకపోవడంతో ఆమె టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. జిల్లా కోర్టులో కేసు నడుస్తోంది. కోర్టు వాయిదాలకు హాజరుకాకపోవడంతో కోర్టు అరెస్ట్ వారెంట్ జారీచేసింది. గత నెలలో అనకాపల్లిలో అదుపులోకి తీసుకున్న నిందితుడి సబ్‌జైల్‌లో ఉంచారు. ఎస్కార్ట్ సాయంతో కోర్టు వాయిదాకు తీసుకువచ్చారు. వాయిదాకు వస్తాడని తెలిసి అమ్మ నాగమణి, మూడో అక్క నాగేశ్వరి సైతం కోర్టుకు వచ్చారు.

ఐదేళ్ల నుంచి వాయిదాలకు తిరుగుతున్నానని, బాధ భరించలేక ఆత్మహత్య చేసుకుని చనిపోదామని నిర్ణయించుకుని మూడో ఫ్లోర్ నుంచి దూకేసినట్లు త్రిమూర్తులు ఫిర్యాదులో పేర్కొన్నారు. వెంటనే పోలీసులు, కుటుంబ సభ్యులు ప్రైవేటు ఆస్పత్రికి, అక్కడ నుంచి జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. కాళ్లు, చేతులు, తలకు చిన్నపాటి గాయాలయ్యాయని, ప్రస్తుతం అతని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని టూటౌన్ పోలీసులు తెలిపారు.



విజయనగరం జిల్లా కేంద్రాస్పత్రిలో చికిత్స పొందుతున్న త్రిమూర్తులు

వందేభారత్‌లో సిగరెట్ పొగ

టీసీని నిలదీసిన ప్రయాణికులు

సాక్షి, విశాఖపట్నం: వందేభారత్ రైలులో సిగరెట్ పొగ కలకలం సృష్టించింది. విశాఖ నుంచి సికింద్రాబాద్‌కు సోమవారం ఉదయం బయల్దేరిన వందేభారత్ రైలు బాత్‌రూమ్‌లో ఓ ప్రయాణికుడు సిగరెట్ తాగాడు. బోగీ మొత్తం పొగ, సిగరెట్ వాసన రావడంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. అక్కడికి వచ్చిన టీసీని నిలదీశారు. ట్రైన్‌లోని సీసీటీవీ ఫుటేజీ పరిశీలించి.. సిగరెట్ తాగిన ప్రయాణికుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై సదరు టీసీ తనకేం సంబంధం లేదని, తానేం చెయ్యలేనంటూ ప్రయాణికులతో వాదనకు దిగారు. సిగరెట్ కారణంగా ఏదైనా అగ్ని ప్రమాదం సంభవిస్తే బాధ్యులెవరంటూ ప్రయాణికులు ప్రశ్నించారు. దీంతో టీసీ అక్కడి నుంచి విసురుగా వెళ్లిపోయారు. ఈ వ్యవహారం మొత్తం సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. దీనిపై స్పందించిన రైల్వే అధికారులు.. సిగరెట్ తాగిన ప్రయాణికుడ్ని గుర్తించి చర్యలు తీసుకుంటామని ప్రకటించారు.



టీసీని నిలదీస్తున్న ప్రయాణికులు